సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 12 । మార్చి । 2024




అర్జీలకు సత్వర పరిష్కారం

జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జేసీ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. 8లో



పోలీసులకు స'పోర్టు'


నగర పోలీసులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. 8లో



న్యూస్‌రీల్

'ఆనందపురం-అనకాపల్లి' హైవే జాతికి అంకితం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



అనకాపల్లి-ఆనందపురం ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి

సాక్షి, అనకాపల్లి: 'ఆనందపురం-సబ్బవరం-అనకాపల్లి' జాతీయ రహదారిని సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.29,395 కోట్ల విలువైన పలు జాతీయ రహదారులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.2,013 కోట్లతో 50.8 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఆనందపురం-అనకాపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కూడా ఉంది. ఎన్‌హెచ్-16 ఆరు లైన్ల జాతీయరహదారి నిర్మాణంతో విశాఖపట్నానికి ట్రాఫిక్ సమస్యలు తొలగాయి. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు రోడ్డుకు మధ్యలో 32 వేలకు పైగా మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడేవిధంగా ఈ రహదారిని నిర్మించారు. దాదాపు ఏడాది నుంచి జాతీయ రహదారి మీదుగా రాకపోకలు జరుగుతున్నాయి. అనకాపల్లి-సబ్బవరం-ఆనందపురం జాతీయ రహదారిని లాంఛనంగా ప్రారంభించిన ప్రధాని మోదీకి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


పోర్టుని సందర్శించిన ఐఏఎస్‌ల బృందం



ఐఏఎస్‌ల బృందంతో పోర్టు అధికారులు

సాక్షి, విశాఖపట్నం : ఐఏఎస్‌గా పదోన్నతులు పొందిన వివిధ రాష్ట్రాల క్యాడర్‌కు చెందిన 16 మంది సభ్యులతో కూడిన బృందం, భారత్ దర్శన్‌లో భాగంగా విశాఖపట్నం పోర్టును సోమవారం సందర్శించింది. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వివరాలు, వాణిజ్య పరమైన అవకాశాలు, పోర్టులో జరుగుతున్న ఆధునికీకరణ, యాంత్రీకరణ పనులకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు పాల్గొన్నారు.

దివ్యాంగ సురక్షతో భరోసా



విద్యార్థితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

కొమ్మాది: దిశ దివ్యాంగుల సురక్ష ఆపదలో ఉన్నవారికి ఎంతో రక్షణగా నిలుస్తోందని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అన్నారు. బీచ్ రోడ్డు మంగమారిపేటలోని వారీజా నేత్ర విద్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. అభ్యసిస్తున్న విధానం, బ్రెయిలీ లిపిలో చదువుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్‌నకు కొనసాగింపుగా దిశ దివ్యాంగ సురక్ష యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దివ్యాంగ సురక్ష టోల్‌ఫ్రీ నంబర్ 73374 34422 ద్వారా దివ్యాంగులు ఆపదలో ఉన్నప్పుడు వీడియో కాల్, లేదా వీడియో సందేశంతో పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రూ.5,794.99 కోట్లు

జిల్లాలో 25,86,924 మందికి సంక్షేమ పథకాల ద్వారా చేరిన మొత్తం



పింఛను తీసుకుంటున్న అవ్వ కళ్లలో ఆనందం

- ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా ప్రభుత్వ సాయం
- నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన నగదు
- సామాన్యులకు భరోసా అందించిన సీఎం వైఎస్ జగన్



ఇన్‌పుట్ సబ్సిడీ అందుకుంటున్న రైతులు

సాక్షి, విశాఖపట్నం :

అభివృద్ధి అంటే.?
ఒక కుటుంబం ఆర్థికంగా ఎదగడం..
నిలువ నీడలేని ఒక కుటుంబానికి సొంత చిరునామా కల్పించడం..
ఆసరా లేని నిరుపేదకు నేనున్నానంటూ భరోసా ఇవ్వడం..
ఒక విద్యార్థికి అమ్మఒడి లాంటి బడిని అందించి.. మంచి విద్యతో భవిష్యత్‌ను అందించడం..
ఒక అవ్వాతాత.. శేష జీవితమంతా సంతోషంగా గడిపేలా చిరునవ్వు కానుకగా ఇవ్వడం..
ఒక రైతుకు వ్యవసాయం దండగ కాదు.. పండగ అనేలా సాయమందించడం..
ఒక మహిళ తన కుటుంబాన్ని పోషించుకునేంత సాధికారత కల్పించడం...
ఒక నేతన్న కుటుంబానికి నేస్తంలా నిలబడటం..
ఒక మత్స్యకారుడికి వేట లేకపోయినా సముద్రమంత స్థైర్యాన్ని నింపడం...
ఒక పెళ్లి జంటకు పంచభూతాల సాక్షిగా నిరంతరం తోడుండేలా కల్యాణమస్తు అని దీవించడం..
ప్రతి ఇంటికీ విప్లవాత్మక పాలన అందించడం..
ఒక ఊరికి కుల, మత, రాజకీయాలు చూడకుండా విద్య, వైద్యం అందించడం...
మొత్తంగా.. ప్రతి ఇల్లూ.. ప్రతి గడపా..
ప్రతి గ్రామం సంతోషంగా జీవించడం...
గడిచిన 58 నెలల కాలంలో జరిగిన అభివృద్ధి ఇదే.



వైఎస్సార్ చేయూత అందుకుంటున్న లబ్ధిదారులు

ఇది కాదా.. అభివృద్ధి.?

అభివృద్ధి అంటే.. కేవలం భవనాలు, రహదారులు అని భావించే ప్రభుత్వాలకు చెంపపెట్టుగా.. అభివృద్ధి అంటే.. పరిపాలన వికేంద్రీకరణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం.. సంతృప్తికరంగా సంక్షేమ పథకాలతో ప్రయోజనం కల్పించడం.. సామాజిక న్యాయం.. మహిళా సాధికారత అని చూపిస్తూ.. ప్రతి ఇంట్లోనూ చిరునవ్వుకు సాక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందనడానికి ఈ గణాంకాలే సాక్ష్యం.



విద్యాదీవెన అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాపాలనకు సాక్ష్యాలివే..

- మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక మంచి దేశాన్ని, సుస్థిర సమాజాన్ని సృష్టించడానికి ఎంతో అవసరమవుతుందని భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన సాధికారత కనిపించింది..
- మీరు.. సామాజిక స్వేచ్ఛను సాధించనంత కాలం, చట్టం ద్వారా ఏ స్వేచ్ఛ అందించినా.. ప్రయోజనం ఉండదన్న డా.బి.ఆర్.అంబేడ్కర్ మాటల్లోని సామాజిక స్వేచ్ఛ అన్ని వర్గాలకు అందింది.
- పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు, పల్లెలు స్వయం సమృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందినట్లు అని చెప్పిన మహాత్మా గాంధీ కలలు కన్న స్వరాజ్య స్థాపన జరిగింది.
- మానవ వనరులపై పెట్టుబడి లేకుండా స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రగతి సాధించలేమన్న ఆర్థిక వేత్త అమర్త్యసేన్ ఆలోచనలు అమలై.. సుస్థిర ఆర్థిక వృద్ధితో ప్రతి ప్రాంతం ప్రగతి పథంలోకి దూసుకెళ్లింది.
- పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే.. మీరు వారి చేతికి నేరుగా డబ్బులు ఇవ్వండి.. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించాలంటే ఖర్చు చేయడమే మార్గమని చెప్పిన ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ మాటలు అక్షర సత్యమయ్యాయి. పేదల జీవన ప్రమాణాలు వంద రెట్లు మెరుగుపడ్డాయి.

విశాఖ జిల్లాలో..

జిల్లాలో ఒకరికి కాదు.. ఇద్దరికి కాదు.. ఏకంగా.. 25,86,924 మందికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా.. ప్రభుత్వం అందించిన మొత్తం ఎంతో తెలుసా..? అక్షరాలా... 5 వేల 794 కోట్ల 99 లక్షల 37 వేల 897 రూపాయలు.

ఈ లెక్కలన్నీ చూసి..

ఇంత డబ్బులు ఇచ్చారు అంటున్నారు కానీ.. ఇదంతా ప్రజల సొమ్మే కదా..? తిరిగి ప్రజలకే పంచారుగా.. అని.. కొందరు ప్రతిపక్ష నేతలు ఎద్దేవా చేస్తున్నారు..!!

నిజమే..

ప్రజల సొమ్మే అనుకుందాం..? మరి గత ప్రభుత్వాలకు కూడా ఇదే మాదిరిగా ప్రజల సొమ్ము ఖజానాకు వచ్చి ఉండేది కదా.? మరి ఎందుకు తిరిగి ప్రజలకు చేరలేదు. ఆ ప్రభుత్వాలు ఇన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు ఎందుకు అందించలేదు అని ప్రతి లబ్ధిదారుడూ ప్రశ్నిస్తున్నాడు. విశాఖ జిల్లాలో వివిధ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరిన మొత్తం ఇది.

పథకం	లబ్ధిదారులు	బదిలీ చేసిన నగదు
వైఎస్సార్ ఆసరా	2,85,061	638,15,98,523
అమ్మ ఒడి	4,25,001	963,67,40,556
అర్చకులకు కరోనా భృతి	521	26,05,000
జగనన్న చేదోడు	19,602	53,62,80,000
కోవిడ్ సాయం	4,41,096	441,096,000
పంట బీమా	8,471	19,52,54,250
ఈబీసీ నేస్తం	9,134	22,95,30,000
హౌసింగ్(డీబీటీ)	47,881	307,18,23,773
ఇమామ్స్	20	1,00,000
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	7,769	5,73,71,520
జగనన్న తోడు(వడ్డీ)	28,278	1,23,77,674
జగనన్న తోడు(రుణాలు)	56,537	82,80,80,000
జగనన్న వసతి దీవెన	1,26,845	137,13,66,671
జగనన్న విద్యా దీవెన	1,35,050	372,17,29,003
వైఎస్సార్ కల్యాణమస్తు	924	5,49,20,000
వైఎస్సార్ కాపునేస్తం	10,092	40,49,55,000
వైఎస్సార్ లా నేస్తం	109	65,40,000
వైఎస్సార్ మత్స్యకార భరోసా	17,585	45,56,50,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	52	26,16,000
పాస్టర్లకు భృతి	810	40,50,000
వైఎస్సార్ రైతు భరోసా	1,03,933	468,36,84,950
సున్నా వడ్డీ పంట రుణాలు	15,171	3,72,73,463
సున్నా వడ్డీ	3,80,916	114,13,44,822
వైఎస్సార్ వాహన మిత్ర	30,398	102,69,20,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	47,843	35,10,83,275
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	78,593	312,82,62,940
వైఎస్సార్ బీమా	3,479	51,09,30,000
వైఎస్సార్ చేయూత	1,05,526	452,63,81,250
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,00,227	1820,11,97,000
మొత్తం	25,86,924	5794,99,37,897

'సరికొత్త'గా వస్తున్నాయ్!

- రంగులు మార్చుకుంటున్న ఆర్టీసీ బస్సులు
- జిల్లాకు 32 సూపర్ లగ్జరీలు, 6 అల్ట్రా డీలక్స్‌లు



కొత్త రంగులతో రానున్న సూపర్ లగ్జరీ బస్సులు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీలో సరికొత్త బస్సులు రానున్నాయి. కొత్త రంగులతో ఇవి ప్రయాణికులను అలరించనున్నాయి. ప్రస్తుతానికి సూపర్ లగ్జరీలు, అల్ట్రా డీలక్స్‌లకు మాత్రమే రంగులు మారనున్నాయి. దాదాపు పదేళ్లగా సూపర్ లగ్జరీలకు తెలుపు, ఎరుపు, పసుపు రంగుల డిజైన్లు, అల్ట్రా డీలక్స్ బస్సులకు తెలుపుపై నీలం, ఊదా రంగులు ఉన్నాయి. ఇప్పుడు వీటిలో సూపర్ లగ్జరీలకు నీలం, లేత ఊదా రంగులు వేస్తున్నారు. అలాగే అల్ట్రా డీలక్స్ బస్సులకు తెలుపు నీలం, ఆరెంజ్ రంగుల్లోకి మారుస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలు/డిపోలకు కొత్త బస్సులను మంజూరు చేస్తోంది. ఆయా కేటాయింపుల మేరకు ఈ కొత్త బస్సులను పంపించాల్సి ఉంటుంది. ఇందులోభాగంగా తొలుత ఈ కొత్త రంగులను సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులకు వేయాలని నిర్ణయించారు. త్వరలోనే సరికొత్త రంగులతో తయారైన కొత్త బస్సులను ఆయా జిల్లాలకు పంపనున్నారు. విశాఖపట్నం జిల్లాకు 38 వరకు సూపర్ లగ్జరీలు, అల్ట్రా డీలక్స్‌లు మంజూరయ్యాయి. వీటిలో 32 సూపర్ లగ్జరీలు కాగా మిగిలినవి అల్ట్రా డీలక్స్‌లు. వీటిలో నెల రోజుల్లో కొన్ని బస్సులు జిల్లాకు రానున్నాయి. ఇలా జూన్ నాటికి జిల్లాకు కేటాయించిన కొత్త బస్సులన్నీ వస్తాయని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. ఈ బస్సులను డిమాండ్, ప్రయాణికుల రద్దీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దూర ప్రాంతాలకు నడపనున్నామని తెలిపారు. సరికొత్త రంగులతో వచ్చే ఈ బస్సులు ఆకర్షణీయంగా ఉండనున్నాయి. అంతే కాదు.. ఆధునిక సాంకేతికతో తయారయ్యే ఈ బస్సులు ప్రస్తుత సర్వీసుల కంటే మరింత మెరుగ్గా ఉండేలా రూపొందిస్తున్నారు. ఫలితంగా దూర ప్రాంత ప్రయాణికులకు ఈ బస్సుల్లో ప్రయాణించడం వల్ల సౌకర్యవంతంగానూ ఉంటుంది.

సిటీ బస్సులుగా సూపర్ లగ్జరీలు

నిర్దేశిత కిలోమీటర్లు పూర్తి చేసుకున్నప్పటికీ ఇంజిన్ కండిషన్ బాగున్న సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ అధికారులు మరో విధంగా వినియోగంలోకి తెస్తున్నారు. ఇలాంటి బస్సుల ఛాసిస్‌లు మరికొన్నేళ్ల పాటు పనికొస్తాయి. దీంతో ఈ బస్సులకు విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో సరికొత్త బాడీలు నిర్మిస్తున్నారు. వీటిని సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులుగా మార్పు చేసి నడపనున్నారు. ఫలితంగా కొత్తగా సిటీ/పల్లె వెలుగు బస్సులను కొనుగోలు చేయాల్సిన అవసరం కొంతవరకు తప్పుతుంది. డిమాండ్‌కు తగ్గట్టు వినియోగించగా బస్సులు ఇంకా మిగిలి ఉంటే వాటిని స్పేర్‌గా ఉంచుతారు. విశాఖ జిల్లాకు కొత్త బస్సులు వస్తే ఇన్నాళ్లూ పాత బస్సులకు వెచ్చించే నిర్వహణ (మెయింటెనెన్స్) వ్యయం కూడా ఆర్టీసీకి తగ్గుతుంది.

పట్టాలపైకి మరో రెండు వందే భారత్ రైళ్లు

- నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభం
- సికింద్రాబాద్-విశాఖ, విశాఖ-భువనేశ్వర్ మధ్య రాకపోకలు
- కొత్తవలస- కోరాపుట్ డబ్లింగ్ పనులు జాతికి అంకితం
- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడి



సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్ పరిధిలో పలు రైల్వే ప్రాజెక్టులతో పాటు సికింద్రాబాద్-విశాఖపట్నం, విశాఖ-భువనేశ్వర్ మధ్య వందేభారత్ రైళ్ల ప్రారంభం కానున్నాయని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖ-సికింద్రాబాద్ మార్గంలో ఉన్న రైలుకు ఇది అదనంగా ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ రెండు వందేభారత్ రైళ్లతో పాటు, కొత్తవలస-కోరాపుట్ సెక్షన్లు, కోరాపుట్-రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం-టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలు, గూడ్స్ షెడ్, విశాఖ, దువ్వాడ, విజయనగరం స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్ ప్రత్యేక స్టాల్స్‌ని ప్రధాని జాతికి అంకితం చేస్తారని తెలిపారు. 20841/20842 భువనేశ్వర్- విశాఖపట్నం-భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సోమవారం మినహా వారానికి 6 రోజులు పాటు నడిచేలా సర్వీస్ ప్రారంభం కానుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 5.15 గంటలకు విశాఖలో బయలుదేరి అదేరోజు ఉదయం 11 గంలకు భువనేశ్వర్ చేరుకుంటుందనీ.. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్‌లో శనివారం మినహా 6 రోజుల సర్వీసు ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3.30 గంటకు భువనేశ్వర్‌లో బయలుదేరి విశాఖకు రాత్రి 9.30కు చేరుకుంటుందని వివరించారు. ఖుర్దా రోడ్, బల్గావ్, బరంపురం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో నిలుస్తుందని తెలిపారు. 20707/20708 నంబర్‌తో సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం మినహా సర్వీసులుంటాయని తెలిపారు. అయితే ప్రధాని మోదీ ప్రారంభించిన తర్వాత త్వరలోనే రెగ్యులర్ టైమింగ్స్‌ని ప్రకటిస్తామన్నారు.

రైలు కోచ్ రెస్టారెంట్లు

ప్రయాణికులకు ప్రత్యేకమైన భోజన వాతావరణాన్ని అందించడం కోసం, భారతీయ రైల్వే దాని ప్రధాన స్టేషన్లు, పాయింట్లలో రైల్ కోచ్ రెస్టారెంట్లను తెరుస్తోందని డీఆర్ఎం తెలిపారు. ఇందులో భాగంగా విజయనగరంలోని ఏర్పాటు చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను కూడా ప్రధాని జాతికి అంకితం చేస్తారన్నారు. అలాగే కొత్తవలస- కోరాపుట్ డబ్లింగ్ పనులు జాతికి అంకితం ఇవ్వనున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో విడుదలయ్యే అవకాశముందన్నారు. నోటిఫికేషన్ జారీ అయిన క్షణం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో అధికారులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే తమ కార్యాలయాల్లో, ప్రాంగణాల్లో గల వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల ఫొటోలను తొలగించాలని చెప్పారు. అలాగే విగ్రహాలకు ముగుసు వేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ప్రవర్తన నియమావళిలోకి వస్తారని, ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి ఉద్యోగుల వివరాలతోపాటు ఎపిక్ కార్డు నంబర్లను అందించాలని రెండు వారాల క్రితమే అధికారులను కోరినట్టు చెప్పారు. అయితే జిల్లాలో 15 వేలమందికి గాను 1,500 మంది ఉద్యోగులు మాత్రమే ఎపిక్ నంబర్లను అందించారని పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంటు తెలిపిందన్నారు. మంగళవారంలోగా ఎపిక్ నంబర్లు ఆన్‌లైన్ చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, డీఎడీవో ఆర్.పూర్ణిమాదేవి, జీవీఎంసీ, పోలీస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు స్పందన

- జిల్లాలో 2,577 మంది దరఖాస్తు
- రాష్ట్రంలో విశాఖ నుంచే అత్యధికం
- ఈ నెల 25 వరకు దరఖాస్తుకు గడువు

విశాఖ విద్య : ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సోమవారం వరకు ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 18,231 దరఖాస్తులు అందాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 30, అనకాపల్లి నుంచి 1,283, విశాఖ జిల్లా నుంచి 2,577 మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే విశాఖ జిల్లా నుంచే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గతంలో కంటే ఈ సారి ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించటంతో పాటు, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకునేలా పర్యవేక్షణ చేసేందుకు సమగ్ర శిక్ష ఏపీవో అప్పలనాయుడును నోడల్ అధికారి అధికారిగా నియమించారు. అదే విధంగా మండల స్థాయిలో ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించారు. గడువులోగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా సచివాలయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని డీఈవో చంద్రకళ క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

రేపు దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13న దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. డి మార్ట్, మ్యాక్స్ ఫ్యాషన్, రాథోడ్‌సన్స్ సంస్థలో 10 చొప్పున, పిజా హట్‌లో 12 చొప్పున కస్టమర్ సర్వీస్ అసోసియేట్ ఉద్యోగాలు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి 18-25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులు. ఆసక్తి గల వారు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఏయూలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9666092491లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డెక్కిన ఉక్కు మహిళలు



స్టీల్‌ప్లాంట్‌లో నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులు

ఉక్కునగరం: తమకు నూతన వేతనాలు అమలు చేయాలంటూ స్టీల్‌ప్లాంట్ మహిళా కార్మికులు రోడ్డెక్కారు. సోమవారం ఉదయం ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు నిల్చొని నిరసన తెలిపారు. ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు తక్షణమే అమలు చేయాలని, ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ 2007 నుంచి 2019 వరకు జాయిన్ అయిన 3,680 మందికి పైగా ఉన్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నామన్నారు. తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని యాజమాన్యం నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు కార్మిక సంఘాల నాయకులు, యువ కార్మికులు అక్కడకు వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మహిళా కార్మికులు ప్రతిమ, కుమారి, భారతి, దివ్య, వరలక్ష్మి, ఝాన్సీ, దమయంతి, లావణ్య, లీలామణి, హైమావతి, యామిని తదితరలు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత కులాల వృద్ధి

దళిత బహుజన పార్టీ వ్యవస్థాపకుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్


మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

డాబాగార్డెన్స్: రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత కులాలు వృద్ధి చెందుతాయని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. ఏడాదిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన సందేశ్ యాత్ర సోమవారం విశాఖ చేరుకుంది. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం సాధిస్తేనే దళిత, బహుజనుల సమస్యలు పరిష్కారమవుతాయని, అంతిమంగా పీడిత కులాలు అభివృద్ధి చెందుతాయని అంబేడ్కర్ చెప్పారన్నారు. బాబా సాహెబ్ సిద్ధాంతాలు, ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే గాక వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు బాణా రమేష్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ పీతల కొండబాబు, కొండల రావు, సిటీ కన్వీనర్ బి శంకర్, జాయింట్ కన్వీనర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు స'పోర్టు'

- పోర్ట్ చైర్మన్ అంగముత్తు
- ముగిసిన వార్షిక స్పోర్ట్స్ గేమ్స్ మీట్
- ఓవరాల్ చాంప్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్


టగ్ ఆఫ్ వార్ పోర్టు చైర్మన్ జట్టుతో తలపడుతున్న సీపీ జట్టు


సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టుకు ఓవరాల్‌చాంప్ షీల్డ్ అందిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్ : నగర పోలీసులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. విశాఖ ఆర్మ్‌డ్ పోలీస్ బారెక్స్ గ్రౌండ్‌లో వార్షిక స్పోర్ట్స్ గేమ్స్ మీట్ సోమవారంతో ముగిసింది. విశాఖ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు షీల్డ్‌తో పాటు పతకాలను అంగముత్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో మౌలికవసతులను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. గతంలో తాను కలెక్టర్‌గా పని చేసిన సమయంలో పోలీసులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పోలీసులు ఎంత పని ఒత్తిడిలో ఉన్నా స్పోర్ట్స్‌కు దూరం కావొద్దన్నారు.

పోర్టు సహకారం మర్చిపోలేం : సీపీ

నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ కష్టనష్టాలను తెలుసుకున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు పెండింగ్‌లో ఉన్న కోటి రూపాయలు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాది సైతం ఇదే తరహాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పోర్టు నుంచి సాయం కోరుకుంటున్నామన్నారు. సైబర్ క్రైమ్ నేడు బాగా పెరిగిపోయిందని దాని కోసం సైబర్ ల్యాబ్‌ను పోర్టు అందించిన ఆర్థిక సాయంతో ఏర్పాటు చేస్తామన్నారు.సైబర్‌క్రైమ్‌లో టూలింగ్ చాలా ముఖ్యమన్నారు. అలాగే కేసుల్లో సాక్ష్యాలు, సేకరించిన ఆధారాలు సేఫ్‌గా ఉంచడంతో పాటు వాటి కస్టడీని మెరుగ్గా ఉంచేందుకు జోన్ 1,2లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పోలీసులంతా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలన్నారు. వచ్చే ఏడాది జరగనున్న వార్షిక స్పోర్ట్స్ మీట్‌కు ఇప్పటి నుంచే తగిన విధంగా సమాయత్తమవ్వాలన్నారు. మహిళా పోలీస్‌లు సైతం 600మంది వరకూ ఉన్నారని వారు కూడా ప్రతీ క్రీడలో భాగమవ్వాలని కోరారు. ఈ సందర్భంగా విజేతలను సీపీ అభినందించారు. తొలుత జట్లు మార్చ్‌పాస్ట్‌తో గౌరవవందనాన్ని సమర్పించారు. శ్రీనివాసరావు సారథ్యంలో పోలీస్ బాండ్ సహకారం అందించింది. తొలుత డీసీపీ వన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా నగర డీసీపీలు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలో గౌరవ అతిథి జట్టు (పోర్టు చైర్మన్ జట్టు) విజేతగా నిలిచింది.

విజేతలు వీరే..

వార్షిక పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్) పోలీస్ దళం ఖాదర్‌బాషా కెప్టెన్సీలో సాధించింది. వ్యక్తిగత స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను మెన్‌లో ఎం.కనకరాజు (పీసీ 3266), వుమెన్‌లో టి.శాంతికుమారి (డబ్ల్యూపీసీ 4315) అందుకున్నారు. మెన్, వుమెన్‌లకు పలు ట్రాక్ ఫీల్డ్ అంశాలతో పాటు వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ మీట్‌లో మినిస్టీరియల్ స్టాఫ్‌తో సహా మరో తొమ్మిది సిటీ పోలీస్ డివిజన్ జట్లు పోటీపడ్డాయి. మెన్ వాలీబాల్‌లో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు విజేతగా నిలవగా, క్రైమ్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మెన్ ఫుట్‌బాల్‌లో ట్రాఫిక్ విభాగం జట్టు విజేతగా నిలవగా, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మెన్ కబడ్డీలో సీఏఆర్ జట్టు విజేతగా నిలవగా... హార్బర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మెన్ బాస్కెట్‌బాల్‌లో ఈస్ట్ జట్టు విజేతగా, సీఏఆర్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సన్యాసినాయుడు, వెంకటరావులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో జయరామ్-ఖాదర్ జోడి విజేతగా నిలవగా, వెంకటరావు-సన్యాసినాయుడు జోడి రన్నరప్‌గా నిలిచింది. అథ్లెటిక్స్ ట్రాక్ అంశాల్లో వంద, 200 మీటర్ల పరుగులో కనకరాజు విజేతగా నిలవగా, 400 మీటర్ల పరుగులో దేముడునాయుడు, 5 వేల మీటర్ల పరుగులో జయరాజ్ విజేతగా నిలిచారు. వుమెన్ వంద, 200, 400 మీటర్ల పరుగులో టి.శాంతికుమారి విజేతగా నిలవగా, 5వేల మీటర్ల పరుగులో సువర్ణకుమారి విజేతగా నిలిచింది. మెన్ వంద, 400 మీటర్ల రిలే పరుగుల్లోనూ, వుమెన్ వంద మీటర్ల రిలే పరుగులోనూ సీఏఆర్ జట్టు విజేతగా నిలిచింది. ఫీల్డ్‌లో జరిగిన మెన్ లాంగ్‌జంప్, హైజంప్‌లో కనకరాజు, షాట్‌పుట్‌లో సంతోష్, డిస్కస్ త్రోలో నూకరాజు, జావెలిన్ త్రోలో మన్మథరావు విజేతలుగా నిలిచారు. వుమెన్ జావెలిన్, డిస్కస్ త్రోలో కె.లక్ష్మి విజేతగా నిలవగా, లాంగ్‌జంప్‌లో వసుంధర, షాట్‌పుట్‌లో ఎం.కుమారి విజేతలుగా నిలిచారు. సీపీవో స్టాఫ్‌కు నిర్వహించిన పోటీల్లో సుధాకర్, సంతోష్, హరికుమార్, మాధవి, భీమాబాయ్, కొండమ్మ ఆయా అంశాల్లో విజేతలుగా నిలిచారు. క్యారమ్స్ మెన్ సింగిల్స్‌లో శివ, డబుల్స్‌లో ప్రశాంత్-సంధాని జోడి విజతలుగా నిలిచారు. వుమెన్ సింగిల్స్‌లో కృష్ణవేణి, డబుల్స్‌లో జయలక్ష్మి-చంద్రవదన జోడి విజేతలుగా నిలిచారు. చెస్‌లో ప్రసాద్, భీమాబాయ్, టెన్నికాయిట్ సింగిల్స్‌లో కృష్ణవేణి, డబుల్స్‌లో మహాలక్ష్మి-చంద్రవదన జోడి విజేతలుగా నిలిచారు.

పెళ్లి పేరుతో సీరియల్ నటి మోసం

మీడియాతో భర్త శ్యామ్‌కుమార్


మాట్లాడుతున్న పిన్నింటి శ్యామ్‌కుమార్

సీతంపేట : అత్తారింటికి దారేది, పలుకే బంగారమాయే సీరియల్ ఫేం అద్దాల ఐశ్వర్య పెళ్లి పేరుతో తనను మోసం చేసిందని ఆమె భర్త శ్యామ్‌కుమార్ ఆరోపించాడు. పెళ్లికి ముందే వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ఆ విషయాన్ని దాచిపెట్టి పెళ్లి చేసుకుందన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం శ్యామ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ మ్యాట్రిమోనియల్ ద్వారా పెద్దలు సంబంధం కుదర్చడంతో 2023 సెప్టెంబర్ 6న విశాఖలో ఐశ్వర్యతో తనకు పెళ్లి జరిగిందని తెలిపారు. అక్టోబర్ 7న హైదరాబాద్‌లో ఐశ్వర్య ఇంటికి వెళ్లామని, అయితే ఆ ఇంట్లో ఆమె స్నేహితుడు డ్రింక్ చేస్తూ కనిపించాడన్నారు. దీంతో తమ ఇద్దరి మధ్య గొడవ జరిగిందని చెప్పాడు. మరుసటి రోజు రియల్ ఎస్టేట్ వ్యాపారి కరణం రమేష్‌తో ఐశ్వర్య ఉండటం చూశానని, నిజం ఎక్కడ బయట పడిపోతుందోనని ఐశ్వర్య తల్లిదండ్రులు తనను బలవంతంగా విశాఖ పంపేశారని వెల్లడించాడు. ఆ తర్వాత కరణం రమేష్ తనకు ఫోన్ చేసి ఐశ్వర్యకు విడాకులు ఇవ్వాలని, లేదంటే గొడవలు జరుగుతాయని హెచ్చరించాడన్నారు. విషయాన్ని ఐశ్వర్య తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళితే.. కట్నం కోసం తన కుటుంబం వేధిస్తున్నట్టు పెందుర్తి పోలీసుస్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, తిరిగి తన కుటుంబంపై కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని శ్యామ్‌కుమార్ కోరాడు. తనను పెళ్లి చేసుకుని మోసం చేసి, తన కుటుంబాన్ని రోడ్డుపైకి లాగారని ఆరోపించాడు. పైసా కట్నం తీసుకోకుండా పెళ్లి ఖర్చులకు తామే డబ్బులు ఇచ్చామని తెలిపాడు. మీడియా సమావేశంలో శ్యామ్‌కుమార్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 84 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్, మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 20 ఫిర్యాదులు, జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)కు 84 వినతులు అందాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన చాంబర్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో అన్ని జోన్ల నుంచి 20 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ నేరుగా బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. 84 ఫిర్యాదులు అందగా, పరిష్కారం కోసం సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. జీవీఎంసీకి ట్రైనింగ్‌పై వచ్చిన డిప్యూటీ కలెక్టర్లు కె మాధురి, ఎస్.అనూష, ఎం.కృష్ణమూర్తి కూడా అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అంకౌంట్స్ వాసుదేవరెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం (జేకేసీ)లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.మొత్తం 238 వినతులను స్వీకరించారు. వీటిలో 82 రెవెన్యూ శాఖ, 14 పోలీసుశాఖ, 88 జీవీఎంసీకి 54 అర్జీలు, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసే ప్రతి అర్జీదారుడు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, డీఎల్డీఓఆర్ పూర్ణిమాదేవి, జీవీఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాటరీ కార్లు కొనుగోలు టెండర్ల వివాదం

ప్రక్రియ నిలుపుదలకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: కేజీహెచ్‌లో బ్యాటరీ కార్లు టెండర్ల వ్యవహారంలో వివాదం నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు ఖరారు చేశారన్న దానిపై కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం బ్యాటరీ కార్లు కొనుగోలు టెండర్లు నిలుపుదల చేసి, విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ కార్లు కొనుగోలుకు స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ నేషనల్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా బ్యాటరీ కార్లు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిబంధన విధించింది. కానీ కేజీహెచ్ అధికారులు కొంత మంది అత్యుత్సాహంతో డీలర్ సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించారు. మూడు సంస్థలు టెండర్లు దాఖలు చేశాయి. అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కొనుగోలు చేయడానికి వీలు లేదని రవాణాశాఖకు చెందిన అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం పోర్టల్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని కేజీహెచ్ అధికారులకు వివరించారు. టెండర్ దక్కించుకున్న విశాఖలో ఒక సంస్థ వాహనాల ప్రదర్శన చేపట్టింది. మిగిలిన సంస్థలు వాహనాల ప్రదర్శనకు ముందుకు రాలేదని తెలుస్తోంది. బ్యాటరీ కార్లు తయారీలో అనుభవం లేని సంస్థకు ఎలా ఇస్తారని, కొంత మంది కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ టెండర్ ప్రక్రియను నిలుపుదల చేసి, విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది.

పోలీస్ స్పందనకు 63 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీలు మణికంఠ, సత్తిబాబు

విశాఖ సిటీ: స్పందనకు వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని డీసీపీ-1 మణికంఠ, డీసీపీ-1 ఎం.సత్తిబాబు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 63 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీలు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏడీసీపీ (అడ్మిన్) ఎంఆర్‌కే రాజుతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి విరాళం


రూ. లక్ష చెక్కును జేసీకి అందజేస్తున్న సీఎల్ఏ బ్యాంక్ మేనేజర్

మహారాణిపేట : మాజీ సైనికుల సంక్షేమానికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బి.రామారావు రూ.లక్ష చెక్కును జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు అందజేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమానికి విరాళాలు అందజేయాలని కలెక్టర్ మల్లికార్జున పిలుపు మేరకు బ్యాంకు సిబ్బంది సమకూర్చిన రూ.లక్ష అందజేశామని రామారావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాప్..? డ్రామా..?

- చిట్టివలస కార్మికవాడలో బాలిక కిడ్నాప్ కలకలం
- పొంతనలేని సమాధానాలతో పోలీసులు అనుమానం
- ఆ సమయంలో సీసీ కెమెరాల్లో కనిపించని బాలిక

తగరపువలస : చిట్టివలస కార్మికవాడలో తొమ్మిదేళ్ల బాలిక కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. అయితే బాలిక చెబుతున్న దానిలో ఎంతవరకు వాస్తవం ఉందన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ విచారణలో కూడా బాలిక మాటలు నమ్మే విధంగా లేవని పోలీసులు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టివలస కార్మికవాడకు చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం కార్మికవాడలో బాలిక కిడ్నాప్ అయినట్లు కలకలం రేగగా భీమిలి పోలీసులు అక్కడకు చేరుకుని బాలికతో పాటు తల్లిదండ్రులను విచారించారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో స్కూల్‌కు వెళ్తుండగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వెనుక భాగంలో ముసుగు వేసుకున్న మహిళ ఒకరు తన ముఖంపై స్ప్రే కొట్టి జ్యూట్‌మిల్లు రామాలయం వరకు తీసుకెళ్లిందని బాలిక పోలీసులకు చెప్పింది. అక్కడ ఓ వ్యక్తి తనను కత్తితో పొడుస్తానని బెదిరించి స్కూల్ బ్యాగ్ ముళ్ల పొదల్లోకి విసిరేసినట్టు తెలిపింది. తాను వారి చేతిని కరిచి స్కూల్ వరకు పారిపోయి వచ్చానని పేర్కొంది. అయితే ఆ ప్రాంతంలో పోలీసులు విచారించగా బాలిక చెప్పిన ప్రదేశంలో కాకుండా స్కూల్ సమీపంలో బ్యాగ్ కనిపించింది. ముఖంపై స్ప్రే చేస్తే బాలిక స్పృహ కోల్పోతుందని అలాంటిది వీధులన్నీ తిప్పినట్టు ఎలా చెప్పిందని అనుమానిస్తున్నారు. అంతేకాకుండా కిడ్నాప్‌నకు గురైన ప్రాంతంలో రెండు చోట్ల సీసీ కెమెరాలను పరిశీలించగా ఎక్కడా బాలిక గానీ, కిడ్నాపర్ల ఆచూకీ గానీ కనిపించలేదు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో కిడ్నాప్ జరిగినట్టు చెబుతున్న ప్రదేశాలన్నీ జన సంచారంతోనే ఉన్నాయి. దీంతో బాలిక చెబుతున్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మానవత్వం చాటుకున్న డిప్యూటీ మేయర్


అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

డాబాగార్డెన్స్: అతనో ప్రజాప్రతినిధి.. జీవీఎంసీలో పనులు చూసుకుంటు స్వగృహానికి కారులో వెళ్తున్నారు. తాను ప్రయాణించే మార్గంలో తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటీపై వెళ్తున్న వ్యక్తి ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తనకెందుకులే అనుకోకుండా..కారులో ఉన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వెంటనే కారు దిగి ప్రాథమిక చికిత్స అందించేందుకు యత్నించారు. పరిస్థితిని గమనించి 108కి సమాచారం అందించారు. 108 ద్వారా ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై 20 ఏళ్ల యువకుడు ప్రమాదానికి గురయ్యాడని, సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించామన్నారు.